క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే వంశీ పర్యటన

విజయవాడరూరల్: రూరల్ మండలం పాతపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ గురువారం పర్యటిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, పార్టీ శ్రేణులు పాల్గొంటారు.

వైభవంగా హోమం



ఉయ్యూరు: పట్టణంలో వేణుగోపాల స్వామి, శ్రీ పంచపట్టాభిరామస్వామి ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా కొనసాగుతున్నాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాలు జీర్ణదశకు చేరుకోవటంతో దేవదాయశాఖ, పాలక మండలి సంయుక్తంగా దాతల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులుపూర్తి కావటంతో ఈనెల 4న ప్రతిష్ఠా కార్యక్రమానికి ముహూర్తం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో యాగశాలలో గత నెల 31వ తేదీ నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆగమ పండితుడు డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి పర్యవేక్షణలో బుధవారం విశేష హోమాలు జరిపించారు. ఆలయ చైర్మన్ లోయ చింతయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు సతీ సమేతంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

తారు రోడ్డు పనుల పరిశీలన



కంకిపాడు: వేల్పూరు శివారు లక్ష్మీపురం ప్రధాన రహదారి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఈ రహదారిని అభివృద్ధి చేయాలని విన్నవించారు. దీంతో అభివృద్ధి పనులకు అధికారులు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.8 లక్షలు రోడ్డు అభివృద్ధికి కేటాయించారు. రూ.17 లక్షలుఅంచనా వ్యయంతో తారురోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. పనులను పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నేత చెన్నుబోయిన సుబ్బారావు బుధవారం పరిశీలించారు.

జగనన్నను ఆశీర్వదించండి

పెనమలూరు: రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించి సంక్షేమ పాలన అందే విధంగా ప్రజలు ముందుకు రావాలని మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమంలతో భాగంగా మంత్రి తాడిగడప పప్పులమిల్లు వద్ద బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలుగా జగనన్న సంక్షేమ పాలన అన్ని వర్గాల ప్రజలకు అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా జగనన్నకు మద్దతుగా ఉండా ఘన విజయం సాధించి సంక్షేమ పాలన కొనసాగే విధంగా సహకరించాలన్నారు. సంక్షేమ పథకాలు రద్దు చేయటానికి ప్రతిపక్ష కూటమి కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

ఔషధ రంగంలో విప్లవాత్మక మార్పులు



రామవరప్పాడు: అన్ని రంగాల్లో ఔషధ రంగం అత్యుత్తమైనదని, నానాటికీ ఈ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని సీఈఎంఎస్ అకడమిక్ లీడర్ బిజినెస్ అడ్వయిజర్ డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో 15వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మురళీ కృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఫార్మా విద్యార్థులు పరిశోధనలు చేసి నూతన ఔషధాలు తయారు చేయాలని సూచించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమీల రాణి మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుత పరిస్థితుల్లో సమర్థవంతమైన ఔషధాలను ఫార్మసిస్టులు తయారు చేయగలుగుతున్నారన్నారు. అనంతరం పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల నిర్వాహకుల తరుపున విజయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

పింఛన్ కష్టాలు

- పింఛను కోసం పడిగాపులు
- క్యూలో నిలబడి నిరీక్షణ
- వలంటీర్లు ఉంటే ఈ బాధలు ఉండేవి కావంటున్న పెన్షనర్లు
- గడిచిన 58 నెలల్లో ఎప్పుడూ ఇబ్బందులు పడలేదు



ఉయ్యూరు సచివాలయం వద్ద క్యూలో నిలబడ్డ లబ్ధిదారులు

కంకిపాడు/ఉయ్యూరు/పెనమలూరు: గోడలు ఆధారంగా చేసుకుని ఒంగిపోయి నడుస్తున్న ఈ వృద్ధురాలి పేరు పుచ్చా లక్ష్మీ ప్రసన్న. ఈ బామ్మ వయస్సు 90 ఏళ్లు. ఇంట్లో సేదతీరాల్సిన వయస్సులో పింఛను కోసం మండుటెండలో రోడ్డునపడింది. తమ ఇంటి నుంచి అరకిలోమీటరు దూరాన ఉన్న సచివాలయానికి కుటుంబ సభ్యులను వెంట తెచ్చుకుని కాలినడకన చేరుకుంది. కార్యాలయం గోడలు పట్టుకుని నడుస్తూ సచివాలయ అధికారుల వద్దకు వెళ్లారు. తీరా పింఛను కోసం వేలిముద్ర నాలుగు సార్లు సేకరించినా వేలిముద్ర పడలేదు. తీరా ఐరిష్‌తో నిర్ధారణ చేసి పింఛను ఇచ్చారు. పింఛను తీసుకుంటూ ''ఈ ఐదేళ్లల్లో ఇప్పుడే నేను ఆఫీసుకు వచ్చా. మా వలంటీరు ఇంటికే వచ్చి పింఛను ఇచ్చే వాడు. ఇవాళ పింఛను కోసం నరకయాతన పడ్డా. ఆ చంద్రబాబుకు ఏమొచ్చింది మాయరోగం. ఆ జగన్ చక్కగా ఇంటికే పింఛను పంపుతున్నాడుగా. ఓటు అనేది మనస్సాక్షిగా వేస్తారు. జనాన్ని ఇబ్బంది పెడితే ఏస్తారా?, వలంటీరు చెబితే మారతామా? మా మనసులో ఎవరు మంచి చేశారు అని నమ్మితే వాళ్లకే ఓటు వేస్తాం. ఇంటికి వచ్చి పింఛను వచ్చేలా ఉంటేను హాయి.' అని ఆయాసపడుతూ వాపోయింది. ఇది ఈమె బాధే కాదు. ప్రతి నెలా ఇంటి వద్దే పింఛను అందుకుంటున్న పండుటాకులు, దివ్యాంగులు, పింఛను లబ్ధిదారుల మనోగతం. టీడీపీ తోక సంస్థలు వలంటీర్లపై అక్కసుతో, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని అడ్డుకట్ట వేయాలనే దురుద్దేశంతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయటం తెలిసిందే. చంద్రబాబు కుయుక్తుల కారణంగా వలంటీర్లను తమ విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల సంఘం ఆదేశించటంతో పింఛను పంపిణీకి బ్రేక్ పడింది. సచివాలయ సిబ్బందితో పింఛను పంపిణీ జరిగేలా యంత్రాంగం చర్యలు తీసుకుంది. దీంతో బుధవారం నుంచి సచివాలయాల్లో పింఛను పంపిణీ చేపట్టారు.

అవస్థలు పడుతూ సచివాలయాలకు..

పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేస్తారని తెలియటంతో లబ్ధిదారులు ఉదయం నుంచే సచివాలయాల వద్ద పింఛను కోసం పడిగాపులు పడ్డారు. సచివాలయాలకు చేరుకుని కార్యాలయ ప్రాంగణాల్లో నిరీక్షించారు. సాయంత్రం 3-4 గంటల ప్రాంతంలో సిబ్బంది పింఛనుసొమ్ము పంపిణీ చేశారు. కార్యాలయాల అడ్రస్‌లు కనుక్కుని, అవస్థ పడుతూ పింఛను తీసుకున్నారు. మంచి చేసే వారిని గుర్తుంచుకుంటామని, ఇబ్బందులు పెడుతున్న వారికి గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

గన్నవరం: నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమయ్యింది. పింఛన్ నగదు కోసం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో గ్రామ సచివాలయాలకు చేరుకుని పడిగాపులు పడ్డారు.

ప్రభుత్వ సూచనమేరకు కౌంటర్లు..

రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు ప్రతి సచివాలయంలో పింఛన్ల పంపిణీ కోసం మూడు నుంచి ఐదు కౌంటర్లను ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో సచివాలయ సిబ్బందితో పింఛను పంపిణీ చేశారు. పలు చోట్ల టెంట్‌లు, కుర్చీలు, తాగునీటి సదుపాయం కల్పించారు. అయితే నడవలేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు, వికలాంగులు పింఛన్ నగదు కోసం అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు చేరుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం అనేక ఇబ్బందులు పడ్డాం, తిరిగి ఆ పార్టీ ఫిర్యాదుల కారణంగానే ఇప్పుడు ఈ దుస్థితి వచ్చిందంటూ ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు.

గన్నవరం రూరల్: ప్రతి నెలా ఇంటికి వచ్చే పెన్షన్ ఈ నెల ప్రతిపక్షాల కుట్రతో నడవలేని స్థితిలోని లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతూ సచివాలయాలకు నడిపించారని పలువురు శాపనార్థాలు పెట్టారు. చిన అవుటపల్లి గ్రామంలో పెన్షన్ లబ్ధిదారు గోపవరపు సీతారావమ్మ 76 ఏళ్ల వయసులో పెన్షన్ కోసం సచివాలయానికి వచ్చింది. ప్రతి నెలా వలంటీరు ఇంటికి తెచ్చి ఇస్తున్నారని చెప్పింది. షుగర్ వ్యాధితో, మోకాళ్ళ నొప్పులతో అవస్థలు పడుతూ ఆటోలో మాత్రమే రాగలిగిన తమలాంటి వారిని అవస్థలు పెట్టారని తెలిపింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లను ఏర్పాటు చేసి కన్న



ఉయ్యూరులోని 4, 5 వార్డు సచివాలయంలో లబ్ధిదారుల రద్దీ



కంకిపాడు-1 సచివాలయం వద్ద ఎండలో వృద్ధుల పడిగాపులు



ఉయ్యూరులో పింఛన్ కోసం వస్తున్న పుచ్చా లక్ష్మీప్రసన్న (90)



పింఛను కోసం కుటుంబ సభ్యురాలితో కలిసి వస్తున్న వృద్ధురాలు



బుద్దవరం-2 సచివాలయం వద్ద పింఛన్ కోసం స్టాండ్ సాయంతో వచ్చిన వృద్ధుడు



చిక్కవరంలో సచివాలయం వద్ద వృద్ధుల పడిగాపులు

టీడీపీ దుర్మార్గం కారణంగానే..



ఐదేళ్లుగా వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ నగదు అందజేశారు. టీడీపీ దుర్మార్గపు ఫిర్యాదుల కారణంగా ఇప్పుడు వలంటీర్ల సేవలు దూరమయ్యాయి. పింఛన్ నగదు కోసం తన లాంటి ఎంతో మంది వృద్ధులు రెండు, మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న గ్రామ సచివాలయాలకు వెళ్లిరావడం కష్టం. రాజకీయ పార్టీలు ప్రజలకు మంచి చేయాలి కానీ వలంటీర్ల వ్యవస్థను అడ్డుకుని పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టడం సరికాదు. టీడీపీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తాం.

-మేడూరి పుష్పానాదం, కేసరపల్లి

మా పరిస్థితి అగమ్య గోచరం



పింఛన్ లబ్ధిదారులను ఇబ్బంది పెట్టిన వారికి ఓటమి తప్పదు. ఓటమికి బయపడి ప్రతి నెల ఒకటో తేదీనే తెల్లవారు జామునే పింఛన్ అందించే వలంటీర్లను నిలిపేయడం తగదు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపరుస్తారనే నెపంతో ఇంటికి వచ్చి పింఛన్ అందజేసే వలంటీర్లను ఆపేయడం ఎంత వరకు సమంజసం. ఇప్పుడు మాలాంటి ముసలోళ్ల పరిస్థితి అగోమ్యగోచరంగా ఉంది. తమకు పింఛన్ అందకుండా చేసిన వారికి ఓటుతో బుద్ధి చెబుతాను.

-లాం బెనర్జి, పొట్టిపాడు

ఇంటివద్ద పంపిణీ ఆపడం దారుణం



నేను వృద్ధురాలిని..ఒంటరి మహిళను. బాపులపాడు గ్రామంలోని బండివాని చెరువుగట్టు ఏరియాలో నివాసం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెలా ఒకటో తారీకున వలంటీర్ ఇంటికి వచ్చి నాకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్నారు. కానీ ఇప్పుడు పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లి, పడిగాపులు పడాల్సి వచ్చింది. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయకుండా నిలిపేయటం చాలా దారుణం.

-కంచన నాగేశ్వరమ్మ, బాపులపాడు

ఇలా అయితే చాలా ఇబ్బందే..



నాకు 84 ఏళ్లు.. వయోభారం వల్ల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ప్రతి నెలా వలంటీర్ ఇంటికి వచ్చి చక్కగా పింఛన్ ఇస్తున్నాడు. కానీ ఇప్పుడు వల్లంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ నిలిపివేయటంతో మళ్లీ పంచాయతీ ఆఫీసుకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అంతదూరం వెళ్లి ఫించన్ తెచ్చుకోవటం చాలా ఇబ్బందే.

-సంకుల కృష్ణారావు, బాపులపాడు

వృద్ధుల బాధలు పట్టవా..



నాలాంటి వృద్ధులను బలిపశువులను చేయడం దారుణం. పింఛను పొందాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎండ తట్టుకోలేకపోతున్నాం. సుమారు రెండు కిలోమీటర్లు నడిచి రావాల్సి వచ్చింది. వయస్సు పెరగడంతో కళ్లు తిరిగాయి. తీరా పంచాయతీ కార్యాలయానికి వస్తే సాయంత్రం నుంచి పంపిణీ చేశారు. అప్పటి వరకూ వేచి చూసి పింఛను తీసుకున్నా. వలంటీర్లతో ఇంటివద్దే పంపిణీ చేయాలి.

-గల్లా చిలకమ్మ, ఎనికేపాడు, వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్
- ఎనికేపాడులో ఐదో రోజు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్

రామవరప్పాడు: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో బుధవారం వంశీమోహన్ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ గ్రామంలోని ఇంటింటికీ పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వంశీ వివరించారు. ముందుగా వంశీమోహన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో మహిళలు, అభిమానులు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొని వంశీ వెంట ముందుకు సాగారు. పలువురు మహిళలు వంశీకి మంగళ హారతులిచ్చారు. ప్రచారంలో భాగంగా వృద్ధులు, దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ వంశీ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మంచితోనే ఎన్నికల ప్రచారంలో విశేషంగా ప్రజల నుంచి స్పందన వస్తుందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధి ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న, సంక్షేమ పథకాలు కొనసాగాలన్న మరలా సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు విజయం చేకూరుస్తాయన్నారు. చంద్రబాబు వలే కల్లబొల్లిమాటలు చెప్పడం జగన్‌కు చేతకాదని చెప్పిందే చేసి చూపిస్తాడని ఇప్పటికే నిరూపించారన్నారు. నియోజకవర్గంలో సుమారు రెండు వేల కోట్ల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తమ విలువైన ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలన్నారు. గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, కోనేరు సుబ్బారావు, ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణ చంద్రరావు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, పలు గ్రామాల కన్వీనర్లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

టీడీపీ నేత నిర్వాకంపై ఆందోళన



బాపులపాడు సీఎస్ఐ చర్చి వద్ద ఆందోళన చేస్తున్న సంఘ సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక బాపులపాడు పరిశుద్ధ సీయోను సీఎస్ఐ దేవాలయం సంఘస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. చర్చి పునర్నిర్మాణం కోసం దాతల నుంచి సేకరించిన విరాళాలను సంఘ సభ్యుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. విరాళాలు అందించిన దాతల వివరాలు, చర్చి నిర్మాణ ఖర్చుల వివరాలు తెలియజేయకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీఎస్ఐ చర్చి బిషప్‌కు సంఘస్తులు ఫిర్యాదు చేశారనే అక్కసుతో ఇప్పుడు ఏకంగా చర్చి నిర్మాణ పనులను అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని సంఘస్తులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ అనుమతి లేకుండా చర్చి నిర్మాణం జరుగుతుందంటూ దయాల రాజేశ్వరరావు తన సొంత బావమరిది డొప్పల జయప్రకాష్‌ను అడ్డుపెట్టుకుని న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకువచ్చారని దుయ్యబట్టారు. దీంతో ప్రస్తుతం నూతన చర్చిను అధికారులు సీజ్ చేశారని సంఘస్తులు వాపోయారు. చర్చి నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని గతంలో చెప్పినా దయాల రాజేశ్వరరావు ఇప్పుడు దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన బాపులపాడు పరిశుద్ధ సీయోను సీఎస్ఐ దేవాలయం సంఘస్తులకు ఇప్పుడూ ప్రార్థనా మందిరం లేకపోవటంతో నడిరోడ్డుపై నిలబడ్డామని వాపోయారు. చర్చి పునర్నిర్మాణ కమిటీకి సారథ్యం వహించిన దయాల రాజేశ్వరరావు నిర్వాకం వల్లే నేడు ఈ దుస్థితి వచ్చిందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ గోడును అర్థం చేసుకుని ప్రార్థనా మందిరంలోకి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేరణ ఉత్సవ్ మండల స్థాయి పోటీలు

బంటుమిల్లి: ప్రేరణ ఉత్సవ్ - 2024 మండల స్థాయి పోటీల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు త్రిపురసుందరీ దేవి, వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యపఠనం, కథలు చెప్పటం, పాటలు పాడటం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. సీహెచ్ విశ్వనాథ్, ఎస్.ప్రజ్ఞ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరు ఆంజనేయస్వామివారి గుడి ప్రాంతానికి చెందిన బడుగుశ్రీనివాసరావు అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10 మద్యం సీసాలు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

జెడ్పీ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ బోర్డుల చోరీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ డిస్‌ప్లే బోర్డులు చోరీకి గురయ్యాయి. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అవగాహన చేసుకునేందుకు వీలుగా రెండు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) డిస్‌ప్లే బోర్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. పాఠశాలలోని తరగతి గదుల్లో బిగించిన ఈ ఐఎఫ్‌పీ డిస్‌ప్లే బోర్డులను దుండగులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో అపహరించారు. గది తాళాలు బద్దలుకొట్టి బోర్డులను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విషయాన్ని గుర్తించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.పద్మజ ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా కేయూ

ఉప కులపతి జ్ఞానమణి



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎన్ఎస్ఎస్ విభాగం పనిచేయాలని ఉప కులపతి ఆచార్య జి.జ్ఞానమణి పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన షాహిద్ దివస్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విశ్వవిద్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కోరారు. కృష్ణా విశ్వవిద్యాలయం సముద్ర తీర ప్రాంతంలో ఉన్నందున మత్స్యకార మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.శోభన్ బాబు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందరకృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, ఎన్‌సీసీ అధికారి రామశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు స్వరూప, రవి, శేషా రెడ్డి, శాంతికృప, సుజయ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు.

అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు

గన్నవరం: ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు, టీచర్స్ సంఘానికి దాసరి నవభారతి అందించిన సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక చింతలపేట ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు దాసరి నవభారతి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను యూటీఎఫ్ సంఘ నేతలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కారించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ..ఉపాధ్యాయ రంగంలో 40 ఏళ్ల పాటు నవభారతి సుదీర్ఘమైన సేవలందించారని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆమె రాజీలేని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనేది ఆమెను చూసి నేర్చుకోవచ్చాని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంఈఓ-1 కే రవికుమార్, ఎంఈఓ-2 కమల, విశ్రాంత ఎంఈఓ జయబాబు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కే లెనిన్‌బాబు, జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నవభారతిని సత్కరిస్తున్న విద్యార్థులు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఏఈఆర్వో శ్రీరమ్య

విజయవాడరూరల్: ఎన్నికల కమిషన్ నిబంధనలను పటిష్టంగా అమలు పర్చాలని ఏఈఆర్వో ఎ.శ్రీరమ్య సెక్టార్, ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిబంధనలపై బుధవారం జరిగిన సమావేశంలో ఏఈఆర్వో శ్రీరమ్య మాట్లాడారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు నేరుగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోలేని దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు హక్కును సద్వినియోగంచేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కును సద్వినియోగ పర్చుకునే వారికి 12(డి) ఫాంలను అందజేయాల్సిన బాధ్యత సెక్టార్ అధికారులదే నన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, బూత్ స్థాయి అధికారులతో వెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన వారి నుంచి రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫాం(డి)లో సంతకం చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై ఏఈఆర్వో పలు సూచనలు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు, జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఉందని వివరించారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రవర్తన నియామళి (ఎంసీసీ) సభ్యుడు బి.ఎల్.వి.శేషగిరిరావు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఆర్వో శ్రీరమ్య

వీఆర్వో సస్పెన్షన్

చిలకలపూడి: నగరంలోని 11వ డివిజన్ వీఆర్వో జి.శ్రీదేవిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే డివిజన్‌కు చెందిన తూము నాంచారయ్య తనకు పట్టాను మంజూరు చేశారని, అయితే పట్టాలో హద్దులు రాయకుండా పట్టా ఇచ్చారని ఆర్డీవో ఎం.వాణికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేసిన అధికారులు వీఆర్వో శ్రీదేవిని సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు.